నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు..

అంతరిక్ష దినోత్సవంలో భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరాచారి

చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

చంద్రుగొండ, ఆగస్టు 23: నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) వెంకటేశ్వరాచారి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనపర్చారని అన్నారు. పాఠశాలల్లో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ల్యాబ్‌లో ఉండేలా, ప్రయోగాలు చేసేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో విద్యార్థులు ప్రతిభ కనపర్చాలని ఆకాంక్షించారు. ఇష్టపడి చదివితే భవిష్యత్ ఎంతో బాగుంటుందని అన్నారు. ఎంఈవో సత్యనారాయణ, హెచ్‌ఎం నాజీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

నిర్వాహకుల సమావేశంలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 23: 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలు, వసతిగృహాలకు నాణ్యతతో కూడిన వంట సరుకులు సరఫరా చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. ఏజెన్సీల ద్వారా సరఫరా అయ్యే వంట సరుకుల కోసం ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఆర్‌సీవో నాగార్జునరావు, జీసీసీ డీఎం దావీద్‌లతో కలిసి ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడానికి, విద్యార్థులకు కాస్మొటిక్‌లు సరఫరా చేయడానికి జిల్లాలో పేరుగాంచిన ఏజెన్సీల ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. నాణ్యతపై ఫిర్యాదులు వస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

చంద్రుగొండ పోలీసుల అదుపులో తొమ్మిది మంది వ్యక్తులు

చంద్రుగొండ, ఆగస్టు 23:గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన చంద్రుగొండ మండలంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..చంద్రుగొండ పంచాయతీ శివారు ఇమ్మడిరామయ్యబంజర గ్రామం పక్కన గల జామాయిల్ తోటలో శుక్రవారం తెల్లవారుజామున తొమ్మిదిమంది వ్యక్తులు గుప్తనిధుల కోసం మంత్రగాళ్ల సాయంతో క్షుద్రపూజలు చేశారు. అనంతరం తవ్వకాలు జరుపుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ స్వప్న.. తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సుమారు పది అడుగుల లోతులో తవ్విన పెద్ద గుంతను పోలీసులు పరిశీలించారు. అయితే, తాము అదుపులోకి తీసుకున్న వ్యక్తులను విచారిస్తున్న పోలీసులు.. ఈ ఘటనలో వీరుగాక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్లు లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి : డీఎస్పీ

మణుగూరు టౌన్, ఆగస్టు 23: ఆటో డ్రైవర్లు లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండి యూనిఫాం ధరించాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మణుగూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. గంజాయి, సారా తదితర వాటి రవాణా సమాచారం పోలీసులకు అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆటో డ్రైవర్లకు తెలిపారు. అనంతరం డ్రైవర్లు పలు సమస్యలు పోలీసుల దృష్టికి తేగా వాటి పరిష్కారానికి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వృత్తిని బతికించాలంటే రక్షణ అవసరం

గీతకార్మికుల శిక్షణలో బీసీడీవో ఇందిర

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బీసీడీవో ఇందిర

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 23 : కులవృత్తులను రక్షించుకోవాలంటే ఆ వృత్తులతో బతికే వారికి రక్షణ ఎంతైనా అవసరమని, అందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఈ ఇందిర సూచించారు. శుక్రవారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల స్థాయి గీతకార్మికులకు గీత వృత్తి పట్ల చెట్లు ఎక్కే విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాడిచెట్లు ఎక్కి కల్లు గీసే సమయంలో జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు అధునాతన సాంకేతికతతో రూపొందించడం జరిగిందన్నారు. కాటమయ్య రక్షా కవచ్ పరికరాలతో తాటి చెట్లు ఎక్కడంపై రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ ఇస్తున్నారని అన్నారు. అనంతరం ప్రత్యేక శిక్షణ పొందిన కృష్ణ, వెంకన్నలు శిక్షణ అందించారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వరావు, స్థానిక ఎక్సైజ్ శాఖ ఎస్సై కె రాజేశ్వరావుతోపాటూ రెండు మండలాల గీతకార్మిక సంఘం బాధ్యులు ఆరేపల్లి బాబూరావు, సాంబశివరావు, రాంబాబు, గోవిందు పాల్గొన్నారు.

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి వేధింపులు

- సింగరేణి పాఠశాలలో ఘటన.. టీచర్ సస్పెన్షన్..
- 'పోక్సో' కేసు నమోదు చేసిన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు

కొత్తగూడెం క్రైం/ కొత్తగూడెం సింగరేణి/ కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 23: పాఠాలు బోధించాల్సిన గురువు.. మతిలేని చేష్టలుడిగాడు. విద్యార్థినులను శారీరకంగా వేధింపులకు గురి చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడు. చివరికి విషయం బహిర్గతమై పోలీసులకు చిక్కాడు. విద్యార్థినులను ఓ ఉపాధ్యాయుడు వేధింపులకు గురి చేస్తున్నాడని బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలలో ఆందోళన నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి.. విద్యార్థినుల తల్లిదండ్రులు, పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను తెలుగు ఉపాధ్యాయుడు వేణు వేధింపులకు గురి చేస్తున్నాడు. విద్యార్థినులు ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలపడంతో శుక్రవారం వారంతా పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడు వేణుని, పాఠశాల యాజమాన్య బాధ్యులను నిలదీశారు. అనంతరం ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, ఎస్‌ఐ విజయ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అడ్డుకున్నారు. తెలుగు టీచర్ వేణుని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు వేణుపై అండర్ సెక్షన్ 75(1) బీఎన్ఎస్, 11 రెడ్‌విత్ 12 పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కాగా, సదరు ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేస్తూ సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడు పోలీసుల అదుపులో ఉన్నాడని, పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని జీఎం ఎడ్యుకేషన్ నికోలస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

'దళిత మావోయిస్టు హత్యను ఖండించాలి'

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 23: మావోయిస్టులు తమ పార్టీకే చెందిన దళితురాలి నిండు ప్రాణాన్ని బలిగొనడాన్ని ప్రజలంతా ఖండించాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బండి రాధ అలియాస్ నీల్సో(25)ని మావోయిస్టులు అతి కిరాతకంగా హత్య చేసి, చర్ల మండలం చెన్నాపురం గ్రామ శివారులో మృతదేహాన్ని రోడ్డుపై పడేసి వెళ్లారని తెలిపారు. మావోయిస్టు నాయకులు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ ఘాతుకానికి ఒడిగట్టారని విమర్శించారు. బాగా చదివిన రాధను మావోయిస్టు నాయకులు తమ పార్టీలో చేర్చుకుని, ఆమె భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేశారని, చివరికి ఆమెకు జీవితాన్నే లేకుండా చేయడం ద్వారా తమలో మానవత్వమనేదే లేదనే విషయాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. రాధను పార్టీ నాయకులు లైంగికంగా వేధించారని, కులం పేరుతో దూషించి, చిత్రహింసపాలు చేశారని ఆమె సోదరుడు ఆరోపించినట్లు పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన దళితురాలైన రాధపై పోలీస్ ఇన్ఫార్మర్ ముద్ర వేసి చంపడం ద్వారా అగ్ర నాయకులు తమ నీచ సంస్కృతిని నిరూపించుకున్నారని ధ్వజమెత్తారు. తమ కూతురిని బలవంతంగా తీసుకెళ్లి మావోయిస్టు పార్టీలో చేర్చుకున్నారంటూ రాధ తల్లి పల్లెపాటి పోచమ్మ 2022, జనవరిలో విశాఖపట్నం జిల్లా పెద్దబయలు పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైనట్లు తెలిపారు. రాధ హత్యను యావత్ ప్రజానీకం తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు.

గోదావరి బ్రిడ్జిపై లారీకి మంటలు

సారపాక, ఆగస్టు 23: గోదావరి బ్రిడ్జిపై లారీకి మంటలు అంటుకున్న ఘటన బూర్గంపహాడ్ మండల పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగ్దల్‌పూర్ నుంచి విజయవాడకు ఐరన్ లోడుతో వెళ్తున్న ఓ లారీ వెళ్తోంది. గోదావరి బ్రిడ్జిపై దాని టైరు పంక్చర్ కావడంతో రోడ్డుపై రాపిడి జరిగి మంటలు చెలరేగాయి. అవి లారీకి కూడా వ్యాపించాయి. దీంతో వంతెనపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న బూర్గంపహాడ్, భద్రాచలం పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు కూడా అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

జోనల్‌స్థాయి క్రీడలపై సమావేశం

ఇల్లెందు రూరల్, ఆగస్టు 23 : జోనల్‌స్థాయి, మండలస్థాయి క్రీడల నిర్వహణపై ఎంఈవో పి.కృష్ణయ్య సమావేశం నిర్వహించారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి ప్రభుత్వ, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 10 నుంచి 11 వరకు మండలస్థాయి క్రీడలు, 19 నుంచి 20 వరకు జోనల్‌స్థాయి క్రీడలు నిర్వహించబడుతాయన్నారు. అండర్ - 14లో పాల్గొనే బాల బాలికలు 1.1.2011 తరువాత జన్మించి ఉండాలన్నారు. అండర్ - 17లో పాల్గొనే బాల బాలికలు 1.1.2008 తరువాత జన్మించి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మూడు మండలాల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం 5,893 దరఖాస్తులు

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ అమలులో భాగంగా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల వివరాలను భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు వివిధ కారణాల వల్ల రుణమాఫీ జమ కాని రైతులు 5,893 మంది దరఖాస్తులు చేసుకున్నారని అన్నారు. వీటిలో 4,230 దరఖాస్తులను అప్‌డేట్ చేశామని, తాజాగా శుక్రవారం 1,663 దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించామని వివరించారు. ఆయా అంశాల్లో తప్పుల వారీగా ఇప్పటి వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఆయన వెల్లడించారు.

మండలం	కుటుంబ సభ్యుల సమస్య	ఆధార్	పేర్లలో తప్పులు	బ్యాంక్ సమస్య
అన్నపురెడ్డిపల్లి	187	00	07	05
అశ్వారావుపేట	220	02	27	00
చండ్రుగొండ	142	09	11	03
దమ్మపేట	180	06	02	04
ములకలపల్లి	89	24	21	03
భద్రాచలం	21	03	02	00
చర్ల	203	23	07	04
దుమ్ముగూడెం	205	02	09	00
చుంచుపల్లి	17	00	02	01
జూలూరుపాడు	168	03	08	01
కొత్తగూడెం	17	00	00	01
లక్ష్మీదేవిపల్లి	106	14	00	104
పాల్వంచ	74	06	01	12
సుజాతనగర్	58	12	23	05
ఆళ్లపల్లి	58	05	04	04
అశ్వాపురం	160	25	14	07
బూర్గంపహాడ్	116	28	00	00
గుండాల	67	12	10	01
కరకగూడెం	93	06	02	06
మణుగూరు	41	00	10	02
పినపాక	94	04	11	03
టేకులపల్లి	196	00	43	18
ఇల్లెందు	142	13	19	07
మొత్తం	2,654	197	233	191

సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారానికి సింగరేణి సహకారం

ఏరియా జీఎం దుర్గం రాంచందర్

మణుగూరు టౌన్, ఆగస్టు 23: మాజీ సింగరేణీయుల సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారానికి సింగరేణి తమ వంతు సహకారం అందిస్తుందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. శుక్రవారం పీవీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో కొత్తగూడెం సీఎంపీఎఫ్ ఆధ్వర్యంలో పెన్షన్ అదాలత్ నిర్వహించి మాట్లాడారు. అవగాహన లోపం, వయసు భారంతో దూర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పెన్షన్‌దారులకు సకాలంలో ధ్రువపత్రాలు అందించలేకపోయినా మాజీ కార్మికుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సీఎంపీఎఫ్ బాధ్యులకు సూచించారు. సీఎంపీఎఫ్ కొత్తగూడెం కార్యాలయ రీజనల్ కమిషనర్ కనకమ్మ మాట్లాడుతూ... ఆన్‌లైన్ ద్వారా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం 2020-23 వరకు సీఎంపీఎఫ్ ఆడిట్ స్లిప్స్, రివైజ్డ్ పెన్షన్ ఆర్డర్లు జీఎంకు కమిషనర్ కనకమ్మ అందజేశారు. కార్యక్రమంలో అధికారులు రమేశ్, చిరంజీవి, అవినాష్, సింగు శ్రీనివాస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు రాంగోపాల్, కృష్ణంరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?

బ్లిట్జ్ కథనంపై వివరణ ఇవ్వండి: బీజేపీ ఎంపీ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి పెండ్లయిందా? లేదా?.. పెళ్లయ్యిందంటూ బ్లిట్జ్ పత్రికలో ప్రచురితమైన కథనంపై వివరణ ఇవ్వాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో రాహుల్‌గాంధీ కార్యాలయానికి వెళ్లి, అక్కడి సిబ్బందికి బ్లిట్జ్ పత్రికను అందజేశారు. ఆయన స్వయంగా పత్రికను చదివి, అందులో వచ్చిన కథనంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. భారతదేశ వ్యవహారాలకు సంబంధించి విదేశీ మీడియా సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక సరైనదేనని రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ వాదిస్తున్నపుడు, బ్లిట్జ్ కథనం కూడా సరైనదేనా? అని ప్రశ్నించారు.

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

రాజంపేట్, ఆగస్టు 23: పొలంలో విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం అన్నారం తండాలో శుక్రవారం చోటుచేసుకున్నది. తండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి(33) తనకున్న రెండెకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన తిరుపతికి.. పక్కనున్న పొలానికి కరెంట్ సరఫరా కోసం తీసుకున్న వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వికటించిన టీకా

సౌదీలో జగిత్యాల జిల్లా వాసి యువకుడి నరకయాతన

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: హైదరాబాద్‌లోని ఒక గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో టీకా వేయించుకొని సౌదీకి వెళ్లిన ఓ యువకుడు టీకా వికటించి అస్వస్థతకు గురై నరకయాతన అనుభవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్‌లోని గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలతోపాటు టీకా వేయించుకున్నాడు. ఢిల్లీలోని హెచ్‌ఆర్ ఇంటర్నేషనల్ అనే రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా జాబ్ వీసాపై జూలై 11న సౌదీ అరేబియాలోని అల్-బాద్ తాబూక్‌కు వెళ్లాడు. అక్కడ ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల తర్వాత టీకా తీసుకున్న కుడి భుజానికి ఇన్ఫెక్షన్ అయింది. మెరుగైన చికిత్స కోసం స్వదేశానికి పంపించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని చంద్రశేఖర్ తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. తిరిగి స్వదేశానికి అత్యవసరంగా రప్పించడానికి చర్యలు తీసుకోవాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ పీవోఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది.

పొలంలో మొసలి ప్రత్యక్షం



మల్దకల్, ఆగస్టు 23: పొలంలో మొసలి ప్రత్యక్షం కావడంతో కూలీలు భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం మల్దకల్‌లో వారు పత్తి పనులు చేస్తుండగా.. మొసలి కనిపించడంతో పొలం యజమాని సవారన్నకు తెలిపారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు బంధించేందుకు యత్నించగా తప్పించుకొని సమీపంలోకి బావిలోకి దూరింది. నీటిని మోటర్ల ద్వారా ఎత్తిపోశారు. బావిలోని మొసలిని తాళ్లతో పట్టుకొని బయటకు తీసి కృష్ణానదిలో వదిలేశారు.

రాజన్న ఆలయంలో కొనసాగిన ఏసీబీ తనిఖీలు

వేములవాడ, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న సన్నిధిలో ఏసీబీ అధికారుల తనిఖీలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. గురువారం 20 మంది ఏసీబీ అధికారుల బృందం 12 గంటల పాటు తనిఖీ చేయడంతోపాటు రికార్డు చేయగా, రెండోరోజు పది మంది అధికారులు స్వామివారికి సంబంధించిన లీజులు, పలు విభాగాల టెండర్లు, నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన పలు రికార్డులను 4 గంటలపాటు పరిశీలించారు. లడ్డూ ప్రసాదాల తయారీ, విక్రయాలు, గోదాం నిల్వలు, లీజుల టెండర్లు, వసతి గదుల సముదాయాలు, నిత్యాన్నదానం తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసినట్టు తెలిసింది.

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘట న వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవా రం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

'తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవు'

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవని, స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చే అధికారం తల్లికి ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుశీల్ అగర్వాల్ అనే మహిళకు భర్త నుంచి సంక్రమించిన ఇంటిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచకుండా పెద్దకుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడాన్ని సివిల్ కోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలన్న వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఆ ఆస్తి యజమానిగా తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు చెప్పింది.

ఆ అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- సివిల్ సూట్ల విచారణపై హైకోర్టు స్పష్టీకరణ
- పెండింగ్ సూట్లను కలెక్టర్లకు అప్పగించాలని తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏజెన్సీ చట్ట నిబంధనల ప్రకారం సివిల్ సూట్లపై విచారణ జరిపే అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్నదని, ఆ అధికారాన్ని ప్రభుత్వ అదనపు ఏజెంట్లుగా పీవోలకు కట్టబెట్టడం చెల్లదని స్పష్టం చేసింది. 2002లో ఉట్నూరు ఐటీడీఏ పీవోకు సివిల్ సూట్లను విచారించే అధికారాన్ని అప్పగిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఐటీడీఏ పీవోల వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ సూట్లను కలెక్టర్లకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఒక సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను పరిశీలించేందుకు చేతిరాత నిపుణులకు పంపాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉట్నూరు ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీచేయడంపై హస్నాపూర్ గ్రామానికి చెందిన చవన్ ప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ కే శరత్ శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు.

అన్నలు నా బిడ్డ జీవితాన్ని నాశనం చేశారు

- ఏడేండ్లు సేవ చేయించుకొని హతమార్చారు
- భోరున విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు

ఇంటిముందు విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు పోచమ్మ, బాలయ్య

కాప్రా, ఆగస్టు 23: 'అమ్మా, నాకు ఉద్యోగం దొరకబోతోంది, త్వరలోనే మన కష్టాలు తీరుతాయి' అందరూ జాగ్రత్తగా ఉండండి అంటూ ఇంటి నుంచి వెళ్లిన పల్లెపాటి రాధ అటు నుంచి అటే అదృశ్యమై పోయిందనీ, ఏడేండ్ల తర్వాత విగతజీవిగా తిరిగి వచ్చిందని మావోయిస్టు రాధ అలియాస్ నీల్సో తల్లిదండ్రులు పల్లెపాటి పోచమ్మ, పల్లెపాటి బాలయ్య భోరున విలపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పల్లెపాటి బాలయ్య జీవనోపాధి కోసం కుటుంబంతో 35 ఏండ్ల క్రితం కాప్రాలోని ఇందిరానగర్‌కు వచ్చాడు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె రాధ అలియాస్ నీల్సో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ)కోర్సు పూర్తి చేసింది. మహిళలను చైతన్యం చేసేందుకు, వరకట్న దురాచారాలను, మద్యం వంటి చెడు అలవాట్లనుంచి కుటుంబాలను దూరం చేసేందుకు ఆమె స్వచ్ఛంద సంస్థలో చేరింది. చక్కటి గొంతు, తెలివితేటలు, సమాజాన్ని చైతన్య పరిచాలనే దృక్పథం నచ్చి ఆమెను స్వచ్ఛంద సంస్థ వారు చేర్చుకున్నారు. ఆ సంస్థవారే తమ బిడ్డను ఉద్యమం బాట పట్టిస్తారని ఊహించలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. 2017లో 17 ఏండ్ల వయస్సులో రాధ తమను విడిచి వెళ్లిందని, ఎంత వెతికినా దొరకలేదని చెప్పారు. ఆమె మావోయిస్టుల దళంలో చేరినట్టు మూడేండ్ల క్రితం తెలిసిందని అన్నారు. ఈ నెల 19న ఆమె మృతి చెందిందని, భద్రాచలం వద్ద మృతదేహం ఉన్నట్టు సమాచారం వచ్చిందని తెలిపారు. రాధను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులే చంపారని చెప్పారు. ఆమె ఉద్యమానికి ద్రోహం తలపెట్టే వ్యక్తి అయితే ఏడేండ్లు ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. దళితురాలు అయినందునే కోవర్టు ఆరోపణతో హతమార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంతోమంది ఎన్నో ఏండ్లు నక్సల్స్‌గా పనిచేసి ఏదో ఒక దశలో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని, తన బిడ్డకు మాత్రం ఆ అవకాశం లేకుండా చేశారని విలపించారు. 'ఏడేండ్లు సేవ చేయించుకున్నారు, నా బిడ్డను ఎలా చంపాలనిపించిందయ్యా మీకు' అని తల్లి పోచమ్మ గొల్లుమంది. పేదరికంలో ఉన్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.